# పటుతర చట్టంతోనే అవినీతికి పగ్గం

జయప్రకాష్ నారాయణ్

**BB 15-May-2006**

... ప్రజాస్వామ్య భారతంలో అవినీతి ఓ పద్ధతి ప్రకారం జరిగిపోతోంది. ఒక విధంగా అవినీతి సర్వం వ్యవస్థీకృతమైపోయింది. అవినీతి జరిగే పద్ధతిలో మార్పులేకపోయినా గతానికీ ఇప్పటికీ ఉన్న తేడా ఒక్క 'ధర' విషయంలోనే...

కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల అవినీతి సర్వసాధారణ అంశంగా తయారవుతోంది. హర్యానాలో ఓ ప్రముఖ రాజకీయ నాయకుడు 1500 కోట్ల రూపాయల మేరకు అక్రమంగా వెనకేసుకున్నాడన్న ఆరోపణలు ఇటీవల బలంగా వినిపించాయి. ఆయన ఇంటిపై సి.బి.ఐ. దాడులూ జరిగాయి. రాజకీయ విశ్లేషకులు కానీ, ప్రసార సాధనాలు కానీ ఈ అంశంపై అంత ఆసక్తి చూపలేదు. రాజకీయ నాయకులంటేనే ఇప్పుడు చాలామందిలో సదభిప్రాయం లేదు. నేతలు ఏనాటికీ తమ జేబులు నింపుకోవడంకోసమే పనిచేస్తారన్న భావనా ప్రజల్లో స్థిరపడుతోంది. బహుశా అందువల్లేనేమో... హర్యానా నేత అవినీతి అంశం పెద్ద చర్చనీయాంశం కాలేకపోయింది. అవినీతికి సంబంధించి వినపడే కథనాల్లో చాలావరకు ఉన్నదాన్ని ఎక్కువ చేసి చెప్పే ధోరణే వ్యక్తమవుతోందన్నది నా అభిప్రాయం. ఎవరైనా ఓ వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వస్తే... అవినీతి జరిగిందని చెబుతున్న దాంట్లో కనీసం 20 శాతం మొత్తం అతనికి అంది ఉండవచ్చన్నది నా భావన.

*నీతినిజాయతీలకు చోటేదీ?*

సమాజంలోని అన్ని పార్శ్వాల్లోకి అవినీతి పాకిపోయిందన్న వాస్తవాన్ని మాత్రం అందరం ఒప్పుకోక తప్పదు. ప్రభుత్వ కార్యాలయాల నిబద్ధత ప్రాతిపదికగా తీసుకొని- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇటీవల ప్రకటించిన అవినీతి పట్టికలో భారత్ అట్టడుగు స్థానాల్లో ఉంది. దేశంలోని పది రంగాల్లో చిన్న స్థాయుల్లో జరిగే అవినీతి సంవత్సరానికి 21,000 కోట్ల రూపాయల మేర ఉంటుందని 2005కు గాను సి.ఎం.ఎస్.-టి.ఐ. సంస్థ జరిపిన అధ్యయనం అంచనా వేసింది. చిన్న స్థాయుల్లో అవినీతే ఇంత మొత్తంలో ఉంటే ఇక... దేశంలోని అన్ని రంగాల్లో సకల రకాలుగా జరిగే అవినీతి అందుకు కనీసం పదిరెట్లు ఎక్కువే ఉంటుంది. రోడ్డు రవాణా వ్యవస్థలో 30 లక్షల ట్రక్కుల ఉదంతాన్ని ఇందుకు ఉదాహరణగా చూపవచ్చు. చెక్ పోస్టుల దగ్గర, ఆక్ట్రాయ్ కేంద్రాల వద్ద, మిగిలిన అన్ని చోట్ల కలిపి దేశంలో ప్రతి రోజూ ఒక్కో ట్రక్కు నుంచి 200 రూపాయలు లంచం రూపంలో వసూలవుతోందన్నది ఓ అంచనా. కేవలం ట్రక్కుల రవాణాలో చిన్నస్థాయిలో చోటుచేసుకుంటున్న ఈ అవినీతి విలువే ఏడాదికి 20,000 కోట్లుగా తేలుతోంది. దీని ఆధారంగా మన దేశంలో జరిగే అవినీతి స్థాయిని లెక్క కడితే- ఏడాదికి 200,000 కోట్ల రూపాయలు అక్రమార్కుల జేబుల పాలవుతున్నాయన్నది తేటతెల్లమవుతుంది.

హర్యానా రాజకీయ ప్రముఖుడు 1500 కోట్ల రూపాయలను అక్రమంగా వెనకేసుకున్నాడంటే చాలామంది మరో మాట లేకుండా నమ్మే పరిస్థితే ప్రస్తుతం ఉంది. కానీ ఆ నాయకుడి కుటుంబం మరీ ఇంత 'అమాయకం'గా ఎలా దొరికి పోయిందబ్బా అన్న విషయం మాత్రం ఎందరినో ఆశ్చర్యానికి లోను చేస్తోంది. దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటున్న ఎంతోమంది నేతలు అక్రమ మార్గాల్లో చాలినంత సొమ్ము వెనకేసుకున్నారన్నది నిజం. కానీ వారెప్పుడూ దొరకలేదు. ఎన్నికల నామినేషన్ పత్రాల్లో నాయకులు వెల్లడిస్తున్న ఆస్తుల వివరాలకు, వారు అనుభవిస్తున్న జీవనశైలికి చాలా పెద్ద అంతరమే కనిపిస్తుంది. సి.బి.ఐ. దాడుల వల్ల

అంతిమంగా ఒరిగేదేమీ ఉండదని, అవినీతి నాయకులంతా వివిధ మార్గాల ద్వారా నిర్దోషులుగా బయట పడగలరని నమ్మేవారి సంఖ్య ఎక్కువే ఉంది. ఎన్నికల్లో పోటీచేసేవారు తమ ఆస్తుల వివరాలను వెల్లడించాలంటూ 2002లో సుప్రీంకోర్టు జోక్యంతో అమల్లోకి వచ్చిన నిబంధన కొన్ని అసహజ పరిణామాలకు అంటుకట్టింది. ఎంతో డబ్బుందని, అవినీతిపరుడని ప్రజలందరికీ తెలిసిన నాయకులు- నామినేషన్ పత్రాల్లో వెల్లడిస్తున్న ఆదాయాలు, ఆస్తులు నామమాత్రంగా ఉంటున్నాయి. అదే సమయంలో న్యాయమైన మార్గాల్లో డబ్బు కూడబెట్టుకున్న నిజాయతీపరులైన రాజకీయ నాయకుల ఆస్తి వివరాలు మాత్రం ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్తులు, ఆదాయ వివరాల వెల్లడి మొత్తం ఓ ప్రహసనంగా మారిపోయింది. వాస్తవానికి మన సమాజంలో నిజాయతీపరులైన అధికారులు, రాజకీయ నాయకులు ఎందరో ఉన్నారు. వీరందరినీ అవినీతిపరుల గాటన కట్టేస్తూ పోతే ఇక ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.

ఎన్నికల్లో నెగ్గేందుకు నిర్దేశిత పరిమితికి మించి ఖర్చుపెడుతున్న వారే నేడు ఎక్కడ చూసినా కనిపిస్తారు. అక్రమ మార్గాల్లో ఓట్లను కొనుక్కోవడం కోసం, జనాన్ని మద్యం మత్తులో ముంచేందుకు, గూండాలను మేపేందుకు, అధికారులను లోబరచుకొనేందుకే ఈ లెక్కాపత్రాలు చూపని ఖర్చంతా సరిపోతోంది. పరిమితిలేని ఖర్చు నేపథ్యంలో ఎన్నికల వ్యయాన్ని కచ్చితంగా లెక్కకట్టడం అసాధ్యంగా మారిపోయింది. దేశంలోని పార్టీలన్నీ అయిదు సంవత్సరాల కాలంలో ఎన్నికల్లో లెక్క చూపకుండా చేస్తున్న వ్యయం 10,000 కోట్ల రూపాయలనుంచి నుంచి 20,000 కోట్ల రూపాయల వరకు ఉంటుందని విశ్వసనీయ అంచనాలు తెలుపుతున్నాయి. రాజకీయాలను ఓ వ్యాపారంగా పరిగణించే ధోరణే ఈ అపరిమిత ఖర్చుకు కారణం. అంతకు అంతా సంపాదించుకోవచ్చన్న ఆలోచనే వారిని అపరిమితమైన ఖర్చువైపు నడిపిస్తోంది. మితిమీరిన ఎన్నికల వ్యయం వల్ల అవినీతి తామర తంపగా పెరిగిపోతోంది. రాజకీయాల్లో చేసిన ఖర్చుకు తగిన ప్రతిఫలం ఉంటుందా లేదా అన్న విషయాన్ని హించడం కష్టం. కాలం గడుస్తున్న కొద్దీ గెలవడంకోసం చేయాల్సిన ఖర్చు మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతూ ఉంటుంది. ఇంత అస్థిరమైన పరిస్థితుల్లో పెడుతున్న పెట్టుబడులకు భారీ రాబడులు రావాలని కోరుకోవడం సహజం. ఎన్నికల్లో గెలిచిన తరవాత చాలా పార్టీలకు తమ కార్యకర్తలకు 'భృతి' కల్పించాల్సిన బాధ్యత ఏర్పడుతుంది. ఇందుకోసం మళ్ళీ ప్రజాధనాన్నే కొల్లగొడతారన్న విషయాన్ని వేరే చెప్పనవసరం లేదు. ప్రతిదానికీ కమిషన్లు పుచ్చుకునే దళారులు ఈ అవినీతి భూతాన్ని మరింత పెంచి పోషిస్తున్నారు. ఉద్యోగుల బదిలీల దగ్గరనుంచి, ఉద్యోగాలిప్పించడం వరకు ప్రతి పనికీ ఓ 'ధర' సిద్ధం చేసి పెట్టారు. ప్రజాస్వామ్య భారతంలో అవినీతి అంతా ఓ పద్ధతి ప్రకారం జరిగిపోతోంది. అవినీతి సర్వం వ్యవస్థీకృతమైపోయింది. అవినీతి జరిగే పద్ధతిలో మార్పులేకపోయినా గతానికీ ఇప్పటికీ ఉన్న తేడా అంతా ఒక్క 'ధర' విషయంలోనే. ఫలితంగా అవినీతీ ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోంది. పైపదవుల్లో ఉన్న తమ రాజకీయ గురువుల అనుగ్రహం పొందేందుకు ఛోటామోటా నాయకులు చేసే భారీ వ్యయమూ రాజకీయాల్లో అవినీతి మరింతగా వేళ్లూనుకొనేందుకు దోహదం చేస్తోంది. అధినాయకుల ప్రాపకం పొంది ఏదో ఒక పదవిని సంపాదించాక, దాని ఆధారంగా అప్పటివరకు పెట్టిన పెట్టుబడికి పదింతలు ఎక్కువగా రాబట్టుకునే దుస్సంస్కృతి ప్రబలిపోయింది. ఓ మున్సిపల్ ఛైర్మన్‌నో లేక ఓ ఎమ్మెల్యేనో పొగుడుతూ పత్రికల్లో ప్రకటనలు గుప్పించే నాయకుల తీరు కూడా ఇందుకు ఏమాత్రం భిన్నం కాదు. భారీవ్యయానికోర్చి వారు పత్రికా ప్రకటనలు ఇవ్వడానికి కారణం- భవిష్యత్తులో రెట్టింపు లాభాలను ఆశించేనన్నది విస్పష్టం. రాజకీయాల్లో అవినీతి పోటీతత్వాన్ని మంటగలుపుతోంది. ప్రభుత్వ సేవలను కుంటుపడేలా చేస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలను హరించివేస్తోంది. ప్రజాజీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తోంది. ఆర్థిక పురోభివృద్ధికి పగ్గాలు

వేస్తోంది. ఇలా... జాతి పురోగతిని దెబ్బతీస్తున్న అవినీతి భరతం పట్టాలంటే ఏంచేయాలి?

*ప్రభుత్వ వైఫల్యమే కారణం*

పోటీతత్వం, అవకాశాల పరిధి విస్తృతమైన చోట అవినీతికి అడ్డుకట్ట పడుతుంది. టెలికాం రంగాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మలచుకుని వినియోగించుకోగలిగితే అవినీతి రహిత సమాజ స్థాపన సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ రికార్డుల కంప్యూటరీకరణ ప్రారంభమైనా, భూముల రిజిస్ట్రేషన్‌లో అవినీతి తగ్గుముఖం పట్టలేదు. కానీ, ఇదే ప్రక్రియ మహారాష్ట్రలో విజయవంతమైంది. ఇటీవలి కాలంలో డ్రైవింగ్ లైసెన్సుల జారీ, రెన్యూవల్ విధానంలో అవినీతి ఉధృతి తగ్గడానికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వినియోగించుకోగలగడమే కారణం. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని, తమదైన రీతిలో దౌర్జన్యకరమైన విధానాల ద్వారా న్యాయం చెప్పి, సొమ్ము చేసుకునే సాయుధ ముఠాలు న్యాయవ్యవస్థను ఇప్పటికే 'ప్రైవేటు'బాట పట్టిస్తున్నాయి. న్యాయానికి వెలగడుతున్న దుండగుల ఆగడాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాజకీయాలు భ్రష్టుపట్టడానికి, చట్టసభల్లోకి నేరస్తులు ప్రవేశించగలగడానికి కూడా ఈ రకమైన ప్రభుత్వ వైఫల్యాలే కారణమవుతున్నాయి. అందువల్ల, అవినీతి అంతానికి 'ప్రైవేటీకరణ' ఒక్కటే పరిష్కారం చూపలేదు. అవినీతిపరులు అక్రమమార్గాల్లో కూడబెట్టిన సొమ్ము, ఆస్తులు వారికి ఉపయోగపడకుండా చేయడం- ఈ సమస్యకు ఓ పరిష్కార మార్గం. పదవుల్లో ఉన్న వారు లంచాలు మరిగి సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని లా కమిషన్ తన 166వ నివేదిక (1999)లో సిఫారసు చేసింది. ఇటువంటిదే ఓ చట్టాన్ని జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం ఇటీవలే రూపొందించుకొంది. ఇలాంటి చట్టాలను సమర్థవంతంగా అమలుచేయడం, బినామీ లావాదేవీలు చెల్లుబాటుగాని విధంగా కఠినతరమైన చర్యలు తీసుకోవడం ద్వారా అవినీతిపై ఉక్కుపాదం మోపవచ్చు. ఉన్నంతలో సమాజం నుంచి అవినీతిని పారదోలేందుకు ఇది తేలికైన పరిష్కారమార్గం. నీతిమంతులకు, నిజాయతీపరులకు మాత్రమే అందలం ఎక్కే అవకాశం కల్పించేందుకు వీలుగా ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్నా, రంగుమారిన రాజకీయాలను సన్మార్గం పట్టించాలన్నా మరెన్నో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అన్నిటికంటే ముందు- అవినీతిపరుల ఆటకట్టించేందుకు వారి ఆస్తులను జప్తు చేసేందుకు వీలుకల్పించే చట్టానికి రూపకల్పన చేయడం మన తక్షణ కర్తవ్యం. అందుకు ప్రభుత్వం వీలైనంత త్వరగా నడుం బిగించాలి.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)